
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 29 । జూన్ । 2025



సోమశిలలో 32.910 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 32.910 టీఎంసీలు ఉన్నాయి. 204 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. డెల్టాకు 3,330, ఉత్తర, దక్షిణ కాలువలకు 1,275 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.98,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,930
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,200
నవర (8 గ్రాములు)	రూ.73,600

గరిష్టం/కనిష్టం 39.2 /29.2

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండే అవకాశం. శనివారం గాలిలో తేమ 40 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

న్యాయమూర్తులకు శిక్షణ తరగతులు



ట్రైసైకిల్ ప్రారంభిస్తున్న రాష్ట్ర హైకోర్టు జడ్జి కె శ్రీనివాసులురెడ్డి, జిల్లా జడ్జి, కలెక్టర్ తదితరులు

నెల్లూరు (లీగల్): జిల్లాలోని వివిధ కోర్టుల న్యాయమూర్తులకు కోర్టు హాల్‌లో నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమన్ని ఏపీ హైకోర్టు జడ్జి, నెల్లూరు జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసులురెడ్డి శనివారం ప్రారభించారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జి. శ్రీనివాస్ నోడల్ అధికారిగా మాజీ హైకోర్టు జడ్జిలు బి. శ్యామసుందర్, ఎం .సీతారామమూర్తితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ వర్క్ షాప్‌లో సెక్షన్ 9 సీపీసీ న్యాయపరిధి, చట్టంలో కేసులను విచారించి నిర్ణయించడానికి కోర్టు అధికారం, లోక్ అదాలత్‌పై సమీక్షా, సలహాలు ఇవ్వడం జరిగింది. అనంతరం జిల్లా కోర్టుకు వచ్చే విభిన్న ప్రతిభావంతులైన కక్షిదారుల సౌకర్యార్థం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కెనరా బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అందజేసిన 18 ట్రైసైకిళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఓ ఆనంద్, మునిసిపల్ కమిషనర్ వైఓ నందన్, బ్యాంక్ అధికారులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏపీ జెన్కోలో ప్రమాదం

- కార్మికుడికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన కార్మికుడు శివప్రసాద్

ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరు మండలం నేలటూరు ఏపీ జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రంలో శనివారం జరిగిన ప్రమాదంలో అవుట్‌సోర్సింగ్ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. మచిలీపట్నంకు చెందిన శివప్రసాద్ పదేళ్లుగా ఇక్కడ అవుట్‌సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజువారి విధుల్లో భాగంగా పని చేస్తుండగా ఈహెచ్‌పీ బ్రేకర్ పేలిపోవడంతో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని తోటికార్మికులు హుటాహుటిన నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు.

నీకు చదువు రాదు.. టీసీ తీసుకెళ్లిపో

- ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడి నిర్వాకం

దుత్తలూరు: విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేసి, తదనుగుణంగా తర్ఫీదు ఇచ్చి ఎదిగేందుకు కృషి చేయాల్సిన ఓ ఉపాధ్యాయుడే నీకు చదువురాదు.. టీసీ తీసుకుని వెళ్లిపో అంటూ ఓ విద్యార్థిని అవమానించిన ఘటన దుత్తలూరు ఏపీ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. పాఠశాలలో హర్షవర్ధన్‌రెడ్డి 7వ తరగతి చదువుతున్నాడు. అయితే సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాజశేఖర్ శుక్రవారం విద్యార్థిని పిలిచి టీసీ తీసుకుని వెళ్లమన్నాను కదా మళ్లీ ఎందుకు వచ్చావంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అతని తల్లికి ఫోన్ చేసి పాఠశాలకు వచ్చి మీ అబ్బాయి టీసీ తీసుకెళ్లాలంటూ హెచ్చరించారు. దీంతో విద్యార్థి మేనమామ శనివారం ప్రిన్సిపల్ సైమన్‌రావుకు ఫిర్యాదు చేయడంతో ఆయన విద్యార్థిని పిలిచి వివరాలు సేకరించారు. ఈ విషయమై ప్రిన్సిపల్‌ని వివరణ కోరగా ఉపాధ్యాయుడు సెలవులో ఉన్నాడని విచారించి చర్యలు చేపడతామని తెలిపారు.

అవినీతి మత్తులో అనుమతులు



విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దబడే పాఠశాలల నుంచి కళాశాలల వరకు పర్యవేక్షణాధికారులు అవినీతి మత్తులో జోగుతున్నారు. చదువుకునే బదులు చదువు‘కొనే’ డిగ్రీ కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్నాయి. విద్యార్థి కళాశాలకు రాకపోయినా.. చదువుకోకపోయినా.. సర్టిఫికెట్లు ఇస్తామని ప్రచారం చేసి మరీ అడ్మిషన్లు ఇస్తున్నారు. జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో జిల్లా వాసులే కాకుండా.. పక్క జిల్లాలు, పక్క రాష్ట్రాల విద్యార్థులూ అడ్మిషన్లు పొంది ఉన్నారంటే కళాశాలల నిర్వహణకు అద్దం పడుతోంది. క్వాలిఫికేషన్, క్యారెక్టర్‌తో పనిలేకుండా ఇచ్చే డిగ్రీ పట్టాలు పట్టుకుని ఉద్యోగాలకు వెళ్తే క్వాలిఫై కాక నిరుద్యోగుల జాబితాలో మిగిలిపోతున్న యువత ఎక్కువ కనబడుతోంది.

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ

- కళాశాలకు రాకున్నా సర్టిఫికెట్ ఇస్తామని ప్రలోభాలు
- ఉమ్మడి జిల్లాలో 12 కళాశాలల్లో 25 శాతం కంటే తక్కువ అడ్మిషన్లు
- 8న హాజరుకావాలని యాజమాన్యాలకు నోటీసులు జారీ
- మామూళ్లతో కొరవడిన వర్సిటీ అధికారుల పర్యవేక్షణ
- ఆగస్టులో ప్రవేశాలకు నోటిఫికేషన్



విక్రమ సింహపురి యూనివర్సిటీ

నెల్లూరు (టౌన్): ఉమ్మడి జిల్లాలో డిగ్రీ కళాశాలలు పుట్టగొడుగుల్లా ఏర్పాటు అవుతున్నాయి. డబుల్, ట్రిపుల్ బెడ్ రూమ్‌లు, గాలి, వెలుతురు లేని ఇరుకు గదులు ఉండే భవనాల్లో కళాశాలల నిర్వహణకు వర్సిటీ అధికారులు నుంచి అగ్నిమాపక, పొల్యూషన్ బోర్డు అధికారుల వరకు అవినీతి మత్తులో జోగుతూ అనుమతులిచ్చేస్తున్నారు. అత్యధికంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు ఫైర్, సౌండ్‌లెస్ సర్టిఫికెట్లు, క్రీడా మైదానాలు లేకపోవడం గమనార్హం. క్వాలిఫైడ్ అధ్యాపకులు లేకుండానే నిర్వహిస్తున్నారు. జిల్లా పరిధిలో డిగ్రీ కళాశాలకు అనుమతులిచ్చే విక్రమ సింహపురి యూనివర్సిటీ అధికారులు మామూళ్లు పుచ్చుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2025–26 విద్యా సంవత్సరానికి డిగ్రీలో ప్రవేశాలకు ఆగస్టు తొలి వారంలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం కొనసాగుతోంది. దీంతో అడ్మిషన్లు తగ్గిపోతున్నాయని కళాశాలల యాజమాన్యాల ఫిర్యాదుతో డబుల్ మేజర్ విధానాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో విధివిధానాలు రూపకల్పన తదితర వాటి కారణంగా అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యమవుతుందని చెబుతున్నారు.

జిల్లాలో 64 డిగ్రీ కళాశాలలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 64 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రభుత్వ–9, ఎయిడెడ్–3, ప్రైవేట్– 52 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో 3 ఏళ్ల డిగ్రీ కోర్సుల్లో 45 వేల మందికి పైగా విద్యార్థులు అడ్మిషన్లు పొంది ఉన్నారు. తాజాగా 12 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. మూడేళ్లుగా 25 శాతం కంటే తక్కువ అడ్మిషన్లు ఉండడంతో గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో సమాధానం చెప్పాలని ఆ నోటీసుల్లో పేర్కొంది. జూలై 8వ తేదీన స్వయంగా ఉన్నత విద్యామండలి ఎదుట హాజరై తగు కారణాలు చెప్పాలని ఆయా యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మిగిలిన కళాశాలల యాజమాన్యాల్లో భయం పట్టుకుంది. గత కొన్నేళ్లుగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి విద్యార్థులను తీసుకువచ్చి కళాశాలల్లో అడ్మిషన్లు కల్పిస్తున్నారు. హాజరు సంగతి మేం చూసుకుంటాం , డిగ్రీ సర్టిఫికెట్ మీ చేతిలో పెడతామని ఆయా యాజమాన్యాలు చెబుతుండడంతో విద్యార్థులు చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. డిగ్రీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో ఫీజులు అందజేస్తుండడంతో బినామీ విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నట్లు సమాచారం. విద్యార్థుల హాజరుకు ఎలాంటి థంబ్, ఫేస్ రికగ్నేషన్ యాప్ లేకపోవడంతో కళాశాలకు రాకున్నా హాజరువేసి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను దండుకుంటున్నారు. క్వాలిఫైడ్ అధ్యాపకులు అంతంత మాత్రంగానే ఉంటారు. ఎక్కువ శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తుండటం గమనార్హం.

పర్యవేక్షణ మొక్కుబడి

జిల్లాలో డిగ్రీ కళాశాలల నిర్వహణను విక్రమ సింహపురి యూనివర్సిటీ పూర్తిగా గాలికి వదిలివేసింది. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే కమిటీలు వేసి ఆయా కళాశాలలను క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి ఉంది. అయితే అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత నిదానంగా ప్రైవేట్ కళాశాలలల్లో తనిఖీలు చేస్తున్న పరిస్థితి ఉంది. కళాశాలల నిర్వహణలో ఏమైనా లొసుగులు బయటపడినా, మామూళ్లు దండుకుని మౌనంగా వెళ్లిపోతున్న పరిస్థితి ఉంది. అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులందరూ రోజూ కళాశాలకు వస్తున్నారా లేరా, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్‌ను పూర్తి చేస్తున్నారా లేదా, క్వాలిఫైడ్ అధ్యాపకులు, పబ్లిక్ పరీక్షలను పక్కందీగా నిర్వహిస్తున్నారా లేదా తదితర విషయాలను పట్టించుకోకుండా వదిలివేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రైవేట్ డిగ్రీ కళాశాల నిర్వహణపై పూర్తి స్థాయిలో తనిఖీలు చేసి మెరుగైన విద్యను అందించేలా చేయాలని పలువురు కోరుతున్నారు.

కమిటీ సభ్యులు తనిఖీలు చేస్తారు

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిర్వహణపై త్వరలో కమిటీని నియమిస్తాం. ఆ కమిటీ సభ్యులు ఆయా కళాశాలలకు వెళ్లి పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తారు. జిల్లాలో 12 ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. గత విద్యా సంవత్సరంలో కూడా కళాశాలల నిర్వహణ బాగా లేదని గూడూరులో 2, వెంకటాచలంలో 1 కళాశాలల్లో అడ్మిషన్లు నిలిపి వేశాం. విద్యాసంవత్సర ప్రారంభంలో కళాశాలల విజిట్ చేపడుతాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిగ్రీ కళాశాలల నిర్వహణ తప్పనిసరిగా ఉండాలి.

– హుస్సేనయ్య, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్, వీఎస్‌యూ

పంచాయతీ కార్యదర్శుల ఆందోళన బాట



డీపీఓ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

- డీపీఓ, జిల్లా పరిషత్ కార్యాలయం, కలెక్టరేట్ ఎదుట ధర్నాలు
- పని ఒత్తిడి తగ్గించకుంటే సమ్మెకు దిగుతామంటూ హెచ్చరిక
- సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతి పత్రాలు

నెల్లూరు (పొగతోట) : సమస్యల సాధన కోసం పంచాయతీ కార్యదర్శులు కదం తొక్కారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం డీపీఓ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం, కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ఆందోళనకు దిగారు. భారీ సంఖ్యలో హాజరైన పంచాయతీ కార్యదర్శులు, మండుటెండను సైతం లెక్క చేయకుండా డీపీఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. డీపీఓ, కలెక్టరేట్ అధికారులకు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు. పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య నాయకులు చల్లా ప్రసాద్‌రెడ్డి, ఓ లెనిన్, శ్రీనివాసులురెడ్డి, శివకుమార్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పంచాయతీ కార్యదర్శులను అవహేళన చేస్తూ మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 6 గంటలకే ఇంటింటి చెత్త సేకరణ చేసేటప్పుడు ఫొటోలు పెట్టి అప్‌లోడ్ చేయాలంటూ కార్యదర్శుల స్థాయిని తగ్గిస్తూ మాట్లాడారని వాపోయారు. ఇప్పటికే తమపై పని ఒత్తిడి అధికంగా ఉందన్నారు. ఏ శాఖకు లేని ఐవీఆర్‌ఎస్ కాల్స్ పంచాయతీశాఖకు వద్దంటూ విజ్ఞప్తి చేశారు. పంచాయతీ కార్యదర్శుల వల్లే రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించి గిన్నిస్ రికార్డు నమోదు అయిందన్నారు. యోగాంధ్ర విజయవంతంలో పంచాయతీ కార్యదర్శులు రాత్రి, పగలు శ్రమించారని గుర్తు చేశారు. కార్యదర్శులకు సొంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల పంచాయతీల్లో అన్ని రకాల సర్వేలు, స్వర్ణ పంచాయతీ పనులు, ఇంటి పన్ను వసూళ్లు, పీఆర్ 1 యాప్, గ్రామ సచివాలయాల సర్వేలు, పీజీఆర్‌ఎస్ పనులు, గ్రామ సభలు, పంచాయతీ సమావేశాలు, సంక్షేమ పథకాల అమలు, ఎన్నికల విధులు, ప్రొటోకాల్ విధులు తదితర పనులతో పని ఒత్తిడి అధికంగా ఉందన్నారు. దీంతోపాటు నిత్యం వెబ్ కాన్ఫరెన్స్‌లు, గూగుల్ మీట్‌లు, టెలీకాన్ఫరెన్స్‌లతో ఒత్తిడితో నలిగిపోతున్నామన్నారు. ప్రతిది పంచాయతీ కార్యదర్శులకు అప్పగించడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై కార్యదర్శులు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. కుటుంబ సంక్షేమాన్ని కూడా పట్టించుకోకుండా పనులపై 24 గంటలు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు పురిణి శ్రీనివాసులు, ఆర్.శివకుమార్, ఎస్‌కే ఇంతియాజ్, వహీదా అధిక సంఖ్యలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి



పంచాయతీ కార్యదర్శులు పని ఒత్తిడితో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సంక్షేమ పథకాలు, సర్వేలు, ప్రతిదీ పంచాయతీ సెక్రటరీలకే అప్పగిస్తున్నారు. పండ్లు కాచే చెట్టుకే రాళ్ల దెబ్బలు అన్నట్లు పంచాయతీ కార్యదర్శులకే ప్రతి పనిని అప్పగిస్తున్నారు. పంచాయతీ రాష్ట్ర ఉన్నతాధికారులు కార్యదర్శులను కించపరిచేలా మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శుల మనోభావాలు దెబ్బతినేలా అధికారుల మాట తీరు ఉంది. పని ఒత్తిడి తగ్గించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– చల్లా ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శుల జిల్లా నాయకుడు

అనారోగ్యాల పాలవుతున్నాం



పంచాయతీ కార్యదర్శులపై తీవ్రమైన పని ఒత్తిడి ఉంది. పని ఒత్తిడి కారణంగా అనారోగ్యాల పాలై ప్రాణాలు కోల్పోతున్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఐవీఆర్‌ఎస్ కాల్స్ దూరంగా ఉంచాలి. కార్యదర్శుల సంక్షేమం కోసం అధికారులు, ప్రభుత్వం కృషి చేయాలి.

– ఓ లెనిన్, కార్యదర్శుల జిల్లా నాయకుడు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి



మాట్లాడుతున్న తలశిల రఘురామ్

- ఎమ్మెల్సీ తలశిల రఘురామ్

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, అక్రమ కేసులకు భయపడాల్సిన పనిలేదని ఎమ్మెల్సీ, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురామ్ అభయమిచ్చారు. పొదలకూరులోని జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ నివాసంలో శనివారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో పార్టీ పటిష్టంగా ఉందన్నారు. మరో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు కార్యకర్తలను సమన్వయ పరుచుకుని సమస్యలు ఎదురైతే పోరాడాల్సిందిగా సూచించారు. వెన్నుదన్నుగా తాము నిలబడతామన్నారు. మాజీమంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత మాట్లాడుతూ తన తండ్రి త్వరలోనే కేసుల నుంచి బయటకు వస్తారని, నాయకులు, కార్యకర్తలు మనోధైర్యంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైన తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో పార్టీ స్టేట్ సెక్రటరీ శివశంకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, పొదలకూరు, వెంకటాచలం వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, కోదండరామిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు జీ లక్ష్మీకల్యాణి, ఎస్‌కే అంజాద్, జీ శ్రీనివాసులు, మాజీ ఏఎంసీ చైర్మన్ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఊంజల్‌సేవకు స్వామి అమ్మవార్లను తీసుకువస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీపెనుశిలలక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిలకు శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి అక్కడ తిర్చుపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు.ఉదయం నిత్య కల్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల కల్యాణం ఆగమోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించి పునీతులయ్యారు.

జీతాల్లేవు..
క్రీడల్లో శిక్షణెలా..?

రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మారుస్తామని సీఎం చంద్రబాబు తరచూ ఊదరగొడుతుంటారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తే విస్మయం కలగకమానదు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసే వారికి నెలల తరబడి జీతాలను చెల్లించకపోవడంతో వారి ఆకలికేకలు తీవ్రమవుతున్నాయి. వీటిని సక్రమంగా అందించకపోవడంతో స్టేడియాల్లో క్రీడాకారులకు ఎలా తర్ఫీదునిస్తారో అంతుచిక్కడంలేదు. సమస్యలపై రాష్ట్ర ఉన్నతాధికారులకు లేఖలు పంపినా, ఏ మాత్రం చలనం ఉండటంలేదు.

- వేతనాలు రాక స్టేడియంలో సిబ్బంది ఆకలికేకలు
- లేఖలు రాసినా రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నుంచి స్పందన కరువు
- అనారోగ్యానికి గురైనా కనికరం చూపని సర్కార్
- ఏడాదిగా ఇదే దుస్థితి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో దాదాపు 26 మంది కోచ్‌లు, గ్రౌండ్స్‌మెన్, స్వీపర్లు, సెక్రటరీలు, వాచ్‌మెన్లకు ఏడాదిగా జీతాలు రావడంలేదు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న వీరు తమ వెతలపై రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థకు విన్నవించినా ప్రయోజనం కరువవుతోంది. ఏటా ఇదే పరిస్థితి ఏర్పడినా ఇటీవలి కాలంలో వీరు పరిస్థితి దయనీయంగా మారింది. ఫలితంగా ఇంటి బాడుగలు చెల్లించలేక, కుటుంబాన్ని పోషించలేక నానా అగచాట్లు పడుతున్నారు.

లేఖ రాసినా స్పందనేదీ..?

వీరికి జీతాలు రావడంలేదనే అంశాన్ని తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్‌కు కలెక్టర్ ఆనంద్ మార్చిలో లేఖ రాసినా, స్పందన నేటికీ కొరవడింది. నెల్లూరుతో పాటు ఆరు జిల్లాల మినహా మిగిలిన అన్ని చోట్ల వేతనాలు సక్రమంగానే అందుతున్నాయి. ఇక్కడే ఈ పరిస్థితి ఎందుకని ఎవరైనా ప్రశ్నిస్తే, సరైన సమాధానం కరువవుతోంది. వాస్తవానికి కాంట్రాక్ట్ ఉద్యోగాల్లో పనిచేస్తున్న కోచ్‌లకు రూ.21,500.. జూనియర్ అసిస్టెంట్‌కు రూ.20 వేలు.. ఆఫీస్‌లో పనిచేస్తున్న వారికి రూ.18,500.. స్వీపర్లు, గ్రౌండ్ మార్కర్లకు రూ.15 వేల మేర జీతాలు రావాల్సి ఉంది.

అనారోగ్యానికి గురైనా అదే తీరు..

జీవరత్నం అనే ఉద్యోగి నెల కింద బ్రెయిన్ ట్యూమర్‌కు గురై కాళ్లు, చేతులతో పాటు మాట పడిపోయింది. సాయం చేయాలని మేలో లేఖలు పంపినా, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ పట్టించుకోవడంలేదు. అతని పరిస్థితిని గమనించి ఆర్థిక సాయాన్ని సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్, ఖోఖో, కబడ్డీ తదితర క్రీడాకారులతో పాటు నెల్లూరు డీఎస్‌డీఓ అందజేశారు.



జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయం

ఉన్నతాధికారులకు తెలియజేశాం

జీతాలు రాని విషయాన్ని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఉన్నతాధికారులకు తెలియజేశాం. కలెక్టర్ ద్వారా లేఖలు పంపాం. సమస్య త్వరలో పరిష్కారమవుతుందని భావిస్తున్నాం.

– యతిరాజ్, డీఎస్‌డీఓ

ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి తమకు జీతాలను చెల్లించాలని వీరు కోరుతున్నారు.

వక్ఫ్ ఆస్తుల నుంచి ఆదాయాన్ని ఆర్జించాలి

నెల్లూరు సిటీ: వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవడం ఎంత ముఖ్యమో.. వాటి నుంచి ఆదాయాన్ని ఆర్జించడం అంతే ప్రధానమని వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డు రాష్ట్ర సమావేశాన్ని నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం నిర్వహించారు. సమావేశానికి బోర్డు సభ్యులైన ఎమ్మెల్సీ రూహుల్లా, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఖాజా, అక్రం, ముకర్రం, ఇస్మాయిల్ బేగ్, అఫియా, బేపారీ జాకీర్ అహ్మద్, దావూద్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడారు. రెంట్ రివ్యూ కమిటీని ఏర్పాటు చేసి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బోర్డు ప్రత్యక్ష నిర్వహణలో ఉన్న 1300 షాపుల అద్దెలను పరిశీలించనున్నామని చెప్పారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా ఆయా షాపుల వారితో మాట్లాడి ఆదాయాన్ని పెంచి, తద్వారా పేద ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో వక్ఫ్ బోర్డు సమావేశాలను నిర్వహించడం ద్వారా అక్కడ నెలకొన్న సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. వక్ఫ్ భూములను విక్రయించిన ముతవల్లీలపై విచారించి క్రిమినల్ కేసులు పెడతామన్నారు. బారాషహీద్ దర్గా అభివృద్ధికి బోర్డు తరఫున రూ.1.5 కోట్లను కేటాయించామని, కసుమూరు, ఏఎస్‌పేట దర్గాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయనున్నామని ప్రకటించారు. వక్ఫ్ బోర్డు సీఈఓ మహమ్మద్ అలీ, అబ్దుల్ ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్

పొదలకూరు నిమ్మ ధరలు	
పెద్దవి:	రూ.25
సన్నవి:	రూ.20
పండ్లు:	రూ. 8



ముగిసిన బదిలీల కౌన్సెలింగ్

- హాజరైన 1266 మంది సచివాలయ ఉద్యోగులు
- నియామక తేదీల్లో తప్పులతో గందరగోళం



కౌన్సెలింగ్‌కు హాజరైన వారితో కార్పొరేషన్ కార్యాలయంలో సందడి

నెల్లూరు సిటీ: ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఆరు మున్సిపాల్టీలతో పాటు నగరపాలక సంస్థ పరిధిలో గల వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తించే పలు విభాగాల ఉద్యోగులకు సంబంధించిన బదిలీల కౌన్సెలింగ్‌ను కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఉదయం తొమ్మిదింటికే ఆయా సచివాలయాల ఉద్యోగులు 1266 మంది హాజరయ్యారు. ఉద్యోగులకు సంబంధించిన జాబితాను విడుదల చేయడం.. అందులో నియామక తేదీల్లో మార్పులుండటంతో గందరగోళం నెలకొంది. ఇవి తప్పులతడకగా ఉండటాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తమ కంటే వెనుక చేరిన వారి పేర్లు కౌన్సెలింగ్‌లో ముందు రావడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఎవరికీ ఇబ్బందుల్లేకుండా.. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కౌన్సెలింగ్‌కు ఉద్యోగులు సహకరించారు. అనంతరం కమిషనర్ నందన్ మాట్లాడారు. వార్డు సచివాలయ విభాగం చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేశామని తెలిపారు. ఆప్షన్ల ప్రక్రియను పూర్తి చేశామని, ఉద్యోగులకు వార్డుల కేటాయింపు ప్రక్రియను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు త్వరలో పూర్తి చేయనున్నామని వెల్లడించారు.


క్లుప్తంగా

ద్విచక్రవాహనాల ఢీ: యువకుడికి గాయాలు



తోటపల్లిగూడూరు: ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని వెంకన్నపాళెం సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కోడూరు పంచాయతీ మహాలక్ష్మీపురానికి చెందిన ఊటుకూరు నాగార్జున్ అదే ప్రాంతంలో చికెన్ షాపును నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. పని నిమిత్తం తన స్కూటీపై మహాలక్ష్మీపురం నుంచి వెంకన్నపాళేనికి బయల్దేరారు. ఇదే సమయంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల వద్ద ఎదురుగా స్కూటీపై వస్తున్న షబీనా ఈయన వాహనాన్ని ఢీకొన్నారు. క్షతగాత్రుడ్ని నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు కుటుంబసభ్యులు తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

రైల్లోంచి పడి వ్యక్తి మృతి



మనుబోలు: రైల్లోంచి జారిపడటంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మనుబోలు రైల్వేస్టేషన్ నార్తు యార్డ్ 145 / 33 – 31 కిలోమీటర్ వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడికి 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడు తెలుపు రంగుపై నలుపు గీతలు గల ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. ఎడమ ఛాతిపై కృష్ణవంశీ అనే పచ్చబొట్టు ఉంది. రైల్వే ఎస్సై మాలకొండయ్య ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రెస్‌మీట్‌లో పర్సు చోరీ

నెల్లూరు సిటీ: నగరంలోని ఇందిరాభవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఫొటోలు తీస్తుండగా, తన జేబులోని పర్సును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారంటూ చిన్నబజార్ పోలీసులకు బాధితుడు శనివారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. ఇందిరాభవన్‌లో పీసీసీ చీఫ్ షర్మిల ఇటీవల నిర్వహించిన ప్రెస్‌మీట్‌కు విలేకరి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ క్రమంలో ఫొటోలు తీస్తుండగా, పర్సును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పర్సులో రూ.14,300 నగదు, ఆధార్, ఇతర కార్డులున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లో గ్రేడ్ పొగాకును
కొనుగోలు చేయండయ్యా..


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న రైతులు

- రెండో వేలం కేంద్రంలో రైతుల ఆందోళన
- అర్ధనగ్న ప్రదర్శన
- సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

కందుకూరు: పొగాకు మార్కెట్లో ఈ ఏడాది నెలకొన్న సంక్షోభంతో పూర్తిగా నష్టపోతున్నామని.. పండించిన పంటను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లో గ్రేడ్ పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేయకపోతే తమ పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఈ మేరకు పామూరు రోడ్డులోని రెండో వేలం కేంద్ర పరిధిలో పొగాకు వేలాన్ని అడ్డుకొని రైతులు ఆందోళనకు శనివారం దిగారు. వేలాన్ని నిలిపేసి.. రోడ్డుపైకి వచ్చి వాహనాలను అడ్డుకొని నిరసన చేపట్టారు. ఈ తరుణంలో పోలీసులు జోక్యం చేసుకొని రైతులకు సర్దిచెప్పి ఆందోళనను విరమింపజేశారు. ఆపై రైతులు మరోసారి ఆందోళనకు దిగారు. బోర్డు కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు అర్ధనగ్న ప్రదర్శన జరిపారు. అనంతరం సబ్ కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రాన్ని అందజేశారు. వేలం చివరి దశకు చేరుకుందని, అయినా బోర్డులో పూర్తి స్థాయిలో కొనుగోళ్లు జరగడంలేదని ఆరోపించారు.

అదనపు భారం

రైతుల వద్ద లో గ్రేడ్ రకం పొగాకు ఉత్పత్తులే ప్రస్తుతం ఉన్నాయి. కిలోను ఇప్పటి వరకు రూ.160కు కొనుగోలు చేస్తున్నారు. అయితే తాజాగా ఈ ధరకూ కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ధరలు తగ్గించిచ్చేందుకు సిద్ధమైనా, కొనుగోలు చేయడంలేదని వాపోయారు. వేలం కేంద్రానికి తీసుకొచ్చిన బేళ్లను కొనుగోలు చేయకపోవడంతో తిరిగి ఇళ్లకు చేర్చుకోవాల్సి వస్తోందని, ఫలితంగా రవాణా చార్జీల రూపంలో అదనపు భారం పడుతోందని చెప్పారు. ఒకసారి వేలానికి తీసుకొచ్చి, తిరిగి ఇంటికి తీసుకెళ్లిన బేలులో దాదాపు 10 కిలోల పొగాకు వ్యత్యాసం కనిపిస్తోందని ఆరోపించారు. కొనుగోలు చేయకుండా తిప్పి పంపితే, తామేమీ చేసుకోవాలని, ఎక్కడ విక్రయించాలని నిలదీశారు. అధికారులు జోక్యం చేసుకొని లో గ్రేడ్ ఉత్పత్తులను కొనుగోలు చేసేలా చూడాలని డిమాండ్ చేశారు. క్వింటాల్ లో గ్రేడ్ రకం పొగాకును రూ.32 వేలకు గతేడాది కొనుగోలు చేసిన వ్యాపారులు, ఈ ఏడాది రూ 15 వేలకు కూడా కొనుగోలు చేయకపోవడమేమిటని ప్రశ్నించారు.

ఇరువర్గాలను ఒప్పించి..

వేలం కేంద్రానికి వచ్చిన బోర్డు రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు.. అటు రైతులు, ఇటు వ్యాపారులతో చర్చలు జరిపారు. వేలం సాగేందుకు ఇరువర్గాలను ఒప్పించారు. అయినా లో గ్రేడ్ పొగాకును కొనుగోలు చేసేందుకు చాలా మంది వ్యాపారులు ముందుకు రాకపోవడం గమనార్హం. పొగాకు కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం మాటలకే పరిమితమైందని, చేతల్లో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం



నెల్లూరు సిటీ: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. డ్రైవర్స్ కాలనీలోని బిట్ – 2లో నివాసం ఉంటున్న ఖతీముద్దీన్ (40), నూర్జహాన్ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉడ్ కాంప్లెక్స్‌లో కొయ్య పని చేసేవారు. మూడు నెలలుగా పనిలేకపోవడంతో కుటుంబపోషణకు అప్పులు చేశారు. వీటిని ఎలా తీర్చాలని రోజూ వేదనకు గురయ్యేవారు. కుమార్తె వివాహానికి సరిపడా డబ్బుల్లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో భార్య తన పిల్లలతో కలిసి బెడ్‌రూమ్‌లో శుక్రవారం రాత్రి నిద్రించారు. హాల్లోకి శనివారం వచ్చి చూడగా, సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఉండటాన్ని గమనించారు. భార్య కేకలేయడంతో చుట్టుపక్కలు వారు వచ్చి హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.